ప్రజాశక్తి
శనివారం 26 ఏప్రిల్ 2025
5
శ్రీకాకుళం

జూలై 5కి జాతీయ లోక్ అదాలత్ వాయిదా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మే పదో తేదీన నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను జూలై ఐదో తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ మార్పును కక్షిదారులు, న్యాయవాదులు, ప్రభుత్వ, బ్యాంకు, బీమా, పోలీసు శాఖల అధికారులు గమనించాలని కోరారు. జూలై 5న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

హామీల అమలుకు చూస్తోంది సిక్కోలు

- ఎన్నికల ప్రచార సమయంలో జిల్లాకు అనేక వాగ్దానాలు
- జీడి పంటకు మద్దతు ధర ఇస్తామని ప్రకటన
- ఐటిడిఎ ఏర్పాటుకు హామీ
- ఏడాది గడిచినా ఒక్క అడుగూ పడని వైనం
- నేడు సిఎం చంద్రబాబు నాయుడు జిల్లాకు రాక
- బుడగట్లపాలెంలో వేట నిషేధం సాయం పంపిణీ



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆయన జిల్లాకు రావడం ఇదో రెండోసారి. కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం పేరిట కవిటి మండలం రాజపురంలో గతేడాది సెప్టెంబర్ 19న జిల్లాకు వచ్చారు. రాజపురం సభతో పాటు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో పలుచోట్ల నిర్వహించిన ప్రచార సభల్లో అనేక వరాలు కురిపించారు. హామీల అమలుకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. కొత్త వరాలు, హామీల కన్నా గతంలో ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన కోసం ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. దీంతోపాటు జిల్లాలో ఏళ్ల తరబడి అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా వంశధార ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు ఆధునీకరణకు నోచుకోవడం లేదు. సిఐడి కేసులతో వంశధార షట్టర్ల అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. సిఎం చొరవ చూపితే గానీ ఆ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి కాలువలు ఆధునీకరణ పనులకు నోచుకోలేదు. ప్రధానంగా ఎడమ కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1600 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. గొట్టాబ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉన్నాయి. వంశధార నిర్వాసితులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రకటన కోసం వారు చూస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తూరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ ఇచ్చి వారికి న్యాయం చేస్తామని మాట ఇచ్చారు.

షట్టర్ల సమస్యకు మీరే చూపాలి పరిష్కారం

వంశధార శివారు భూముల సాగునీటికి షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకి మారింది. షట్టర్ల కొనుగోళ్లలో అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. ఘటన జరిగి 13 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ ఒక కొలిక్కి రాలేదు. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. సాగునీటి సలహా మండలి, జిల్లా సమీక్షా కమిటీ సమావేశాలు తదితర సందర్భాల్లో జలవనరులశాఖ అధికారులు పలు పర్యాయాలు ప్రస్తావిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దీనిపై సిఎం స్పందిస్తే షట్టర్ల సమస్య తీరనుంది.

మత్స్యకారులకు ఒక్క కోల్డ్ స్టోరేజీ లేని వైనం

జిల్లాలో 193 కిలోమీటర్ల సుదీర్ఘమైన సముద్ర తీరం ఉన్నా ఎక్కడా కోల్డ్ స్టోరేజీ లేదు. దీంతో మత్స్యకారులు ఏ రోజు మత్స్య సంపదను ఆ రోజే అమ్ముకోవాల్సి వస్తుండడంతో సరైన ధర దక్కడం లేదు. పాలకులు మారుతున్నా కోల్డ్ స్టోరేజీ నిర్మాణం మత్స్యకారులకు నెరవేరని కోరికగానే మిగిలింది. తమ పిల్లలను చదివించుకునేందుకు ఆశ్రమ పాఠశాల కావాలని మత్స్యకారులు చాలాకాలంగా అడుగుతున్నారు. భావనపాడు పోర్టు నిర్మాణంతో భావనపాడు, గెద్దలపాడు ప్రాంతాల్లో మత్స్యకారులకు ఆ ప్రాంతంలో చేపల వేట సాధ్యపడదని, జగన్నాథపురం ప్రాంతంలో మినీ జెట్టీ నిర్మాణం చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

జీడి పంటకు ఏదీ మద్దతు ధర?

జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 50 వేల ఎకరాల్లో పైగా జీడి పంటను సాగు చేస్తున్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర దక్కక ఏటా రైతులు నష్టపోతూనే ఉన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ దోపిడీ సాగిస్తున్నారు. దీనిపై జీడి రైతు సంఘం ఆధ్వర్యాన జీడి పంటకు మద్దతు ధర, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని చాలా కాలంగా పోరాడుతున్నారు. గతేడాది మేలో ఎన్నికల ప్రచారం కోసం పలాస వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు జీడి పంటకు మద్దతు ధర ప్రకటిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఏడాది కాలం గడిచినా దానిపై ఒక్క అడుగూ పడలేదు. అదీగాక ఈ ఏడాది జీడి పంటకు తెగుళ్లు సోకడంతో పంట దిగుబడి సైతం పడిపోయింది. ఈ సమయంలో మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేస్తే వారికి మేలు చేసినట్లవుతుంది.

అడుగు పడని బుడగట్లపాలెం హార్బర్ పనులు

సాగరమాల ప్రాజెక్టుల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని 2020లో నిర్ణయించారు. ఇందుకోసం రూ.365.81 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన డబ్బులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. 2020లోనే భూసేకరణ పూర్తి చేశారు. అదే ఏడాది గ్రామంలో పర్యావరణ మదింపు కూడా చేశారు. 2022 మేలో టెండర్లను పిలిచిన ప్రభుత్వం, విజయవాడకు చెందిన విశ్వసముద్ర ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. ఇప్పటివరకు నిర్మాణానికి సంబంధించి ఒక్క అడుగు కూడా పడలేదు.

ఐటిడిఎ ఏర్పాటుకు గిరిజనుల ఎదురుచూపులు

జిల్లాల పునర్విభజనకు ముందు జిల్లాలో సీతంపేట ఐటిడిఎ కేంద్రంగా గిరిజనులకు సంబంధించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యేవి. ఆదివాసీల సమస్యలూ పరిష్కారమయ్యేవి. జిల్లాల పునర్విభజన తర్వాత శ్రీకాకుళం జిల్లాలో సీతంపేట, భామిని మినహా మెజార్టీ మండలాలు జిల్లాలోనే ఉన్నాయి. జిల్లాల పునర్విభజన జరిగిన నాటి నుంచి జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలంటూ గిరిజనులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతపట్నం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చినా ఇప్పటివరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు.

పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

పటిష్ట పోలీసు బందోబస్తు

ఎచ్చెర్ల : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్‌పి పర్యవేక్షణలో నలుగురు అదనపు ఎస్‌పిలు, ఎనిమిది మంది డిఎస్‌పిలతో సహా మొత్తం 1500 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేశారు. 17 రోప్ పార్టీలు, స్పెషల్ పార్టీలు, క్యూఆర్‌టి బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పకడ్బందీగా బందోబస్తు కల్పించనున్నారు. బుడగట్లపాలెంలో భద్రతా ఏర్పాట్లను విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి శుక్రవారం పోలీసు అధికారులతో కలిసి పర్యవేక్షించారు. హెలీప్యాడ్, సభా వేదిక, ఆలయం దర్శనం, లబ్ధిదారులు కలయిక, మత్స్యకారులతో ముఖాముఖి తదితర రూట్ మ్యాపును పరిశీలించి అవసరమైన బందోబస్తుని కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను కేటాయించి నిర్దేశించిన ప్రదేశాల్లో పార్కింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ట్రయల్ రన్ రిహార్సల్ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా విధులు నిర్వహించాలని, ముఖ్యమంత్రి పర్యటన ముగిసే వరకు కేటాయించిన పాయింట్లలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.దిరాజ్, పి.శ్రీనివాసరావు, కె.వి రమణ, దేవాప్రసాద్, సిఎం సెక్యూరిటీ వింగ్ అదనపు ఎస్‌పి ఎ.వి రమణ, డిఎస్‌పిలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సభా వేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ఉగ్ర దాడి హేయమైన చర్య

సిపిఎం ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు అన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన నగరంలోని డైమండ్ పార్కు నుంచి సూర్యమహల్ కూడలి వరకు శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారని, ఈ ఘటనను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేస్తోందన్నారు.

దేశ ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం తీసుకున్న చర్యలు ఏమాత్రం సరిపోవన్నారు. కాశ్మీర్‌లో భద్రత సరిగా లేదని విమర్శించారు. ఉగ్రవాదానికి మతం, కులం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.తేజేశ్వరరావు, పి.ప్రసాదరావు, కె.నాగమణి, ఎం.మహాలక్ష్మి, సిహెచ్.అమ్మన్నాయుడు, ఆర్.ప్రకాష్, ముస్లిములు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ అనిత

మలేరియా నిర్మూలనే లక్ష్యం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

2027 నాటికి మలేరియా నిర్మూలనే లక్ష్యంగా వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యాన డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు అవగాహనా ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. 'మలేరియాను జయించండి.. జీవితం నిలపండి' అంటూ ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు పాటిస్తే మలేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. ప్రతి ఇంట్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమల పెంపకానికి అవకాశమివ్వకుండా ఉండడమే ప్రధాన చర్యలని వివరించారు. గత ఐదేళ్లలో జిల్లాలో మలేరియా కేసులు గణనీయంగా తగ్గాయన్నారు. ఇంటింటా సర్వేలు నిర్వహిస్తున్నామని, మురుగునీరు నిలిచిన ప్రదేశాల్లో గంబూషియా చేపలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రసాయనాలతో పూసిన దోమతెరలను పంపిణీ చేస్తున్నామన్నారు. చలి జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలని సూచించారు. మలేరియాకు చికిత్స కంటే దోమ కాటు నుంచి నివారణే ఉత్తమమన్నారు. కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఒ తాడేల శ్రీకాంత్, జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ, డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్, ప్రోగ్రాం కన్సల్టెన్సీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రిలో తాత్కాలిక ఉద్యోగాల జాబితా విడుదల

ప్రజాశక్తి - పలాస

పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్న పలు పోస్టుల (రిసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్, డయాలసిస్ టెక్నీషియన్, సి-ఆర్మ్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ, సెక్యూరిటీ) తాత్కాలిక ఎంపిక జాబితాను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన గల కమిటీ విడుదల చేసింది. మొత్తం 289 దరఖాస్తులు రాగా, వాటి ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు.

వీటిపై అభ్యంతరాలను గ్రీవెన్స్ దరఖాస్తుతో సహా ఈనెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి కార్యాలయంలో సమర్పించాలని సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ తెలిపారు. తాత్కాలిక జాబితా, గ్రీవెన్స్ ఫారాన్ని www.srikakulam.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

హామీలను అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో ఐటిడిఎని ఏర్పాటు చేస్తామని, జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, వంశధార నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నేటికీ నెరవేరలేదని గుర్తుచేశారు. ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో జీడి రైతులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. జీడికి గిట్టుబాటు ధర, వంశధార నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ తదితర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 193 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఉన్నా ఒక్క ఫిషింగ్ హార్బర్ కూడా లేదని, గతంలో ప్రారంభించిన ఫిషింగ్ హార్బర్, కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

వంశధార రిజర్వాయర్‌ను పూర్తి చేసి చివర భూముల వరకు రెండు పంటలకు నీరివ్వాలన్నారు. నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం చేసి హిరమండలం రిజర్వాయర్‌కు నీరు తేవాలన్నారు. గొట్టాబ్యారేజీ నిర్మించి 50 ఏళ్లు పూర్తి కావస్తుండడంతో శిథిలావస్థకు చేరుకుందని, ఆధునికీకరణకు రూ.1600 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2007లో ప్రారంభించిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయన్నారు. రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి పలాస ప్రాంతానికి తాగునీరు, మూడు మండలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. నారాయణపురం కుడి కాలువ ఆధునికీకరణకు నిధులు కేటాయించాలన్నారు.

ప్రజల తలసరి ఆదాయం పెరగాలంటే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రెండు పంటలకు నీరు ఇస్తే కృష్ణా, గోదావరి జిల్లాలతో సమానంగా జిల్లా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు కేటాయించి వాటిని కొనసాగించాలన్నారు. కొవ్వాడలో అణు పార్కు పెట్టడమంటే ఉత్తరాంధ్రలో అణు బాంబు పెట్టడమేనని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. జిల్లాలో వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర బృందం 'ఉపాధి' పనులు పరిశీలన

రణస్థలం : మండలంలోని రణస్థలం, రావాడ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం శుక్రవారం పరిశీలించింది. కేంద్ర బృందం సభ్యులు ఎం.ఒ.ఆర్.డి ప్రాజెక్టు అధికారి కిరణ్ పాండ్యా, టెక్నికల్ అధికారి అజయ్ ప్రతాప్ సింగ్ చెరువు పనులు, చెత్త సేకరణ కేంద్రం, సిసి రోడ్డు తదితర పనులను పరిశీలించారు. ఈ పనులకు సంబంధించిన వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. కూలీలతో సమావేశమై పనులు, కూలి, పనిదినాలు, సౌకర్యాలు తదితర వాటిపై ఆరా తీశారు. పనుల నాణ్యతపై సమీక్షించారు. రణస్థలానికి చెందిన రైతు గొర్లె భద్రయ్యకు చెందిన పొలంలో ఉపాధి హామీలో భాగంగా వేసిన కొబ్బరి తోటల పెంపకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ బి.సుధాకరరావు, విజిలెన్స్ అధికారి ఆర్.స్వరూపరాణి, ఎచ్చెర్ల క్లస్టర్ ఎపిడి కె.లోకేశ్వరరావు, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎపిఒ ఎం.శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

మహిళా విద్యకు అధిక ప్రాధాన్యత

- మోడల్ స్కూల్స్‌కు ఉపాధ్యాయుల నియామకం
- కెజిబివిలకు రూ.ఏడు కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా విద్యకు టిడిపి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పురపాలక సంఘ పరిధిలోని జగ్గుశాస్త్రులపేట వద్ద నున్న కెజిబివిలో రెండు కోట్ల 55 లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన లైబ్రరీ, లేబరేటరీలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లల విద్య కోసమే కెజిబివిలు ఏర్పడ్డాయన్నారు. రెండు నియోజకవర్గాలకు ఒక కెజిబివి, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. కెజిబివిలో ఒకసారి అడుగు పెడితే పిజి పూర్తి చేసి ఉద్యోగానికి వెళ్లే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మోడల్ స్కూల్స్‌లో ఒకటి నుంచి ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను నియమిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో కెజిబివి పాఠశాలకు ఏడుకోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, మండల విద్యాశాఖ అధికారి జి.రాజేంద్రప్రసాద్, కెజిబివి పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, బోర గోవిందరావు, సంపదరావు మురళి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 112/2023

Between:-
కెంబూరు అప్పలనాయుడు .....వాది
And:
గేదెల వాసుదేవరావు .....ప్రతివాది

పై నెంబర్ దావాలో వాది ప్రతివాది పైన ప్రోనోటు బాకి రాబట్టే నిమిత్తం దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో ప్రతివాది అయిన గేదెల వాసుదేవరావు గారు పొందూరు కోర్టులో **తేది 15-05-2025న ఉదయం 10.30 గంటలకు** స్వయంగా గాని, వకీలు ద్వారాగా గాని హాజరై అతనికి గల ఆక్షేపనలు తెలియజేయగలరు. అటులు కాని యెడల మీకు వ్యతిరేకముగా తీర్పు ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమయినది.
(శ్రీ కోర్టు వారి ఉత్తరువులతో)

పొందూరు,
తేది: 25-04-2025

అడ్రస్:
గేదెల వాసుదేవరావు
S/o లక్ష్మున్నాయుడు,
గేదెలపేట గ్రామం
జి. సిగడాం మండలం,
శ్రీకాకుళం జిల్లా.

ఐ. శ్రీరాములునాయుడు
న్యాయవాది,
పొందూరు,
ఫోన్: 9441289946.

కార్యాలయం ముందు నినదిస్తున్న కార్మికులు

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

టెక్కలి: టెక్కలిలో ఉన్న ఎఎంఆర్ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు బకాయిపడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం వివిధ స్థానాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు విధులను బహిష్కరించి టెక్కలోని కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, మెళియాపుట్టి తదితర మండలాల పరిధిలో ఉన్న ఎఎంఆర్ సంస్థకు చెందిన ప్రయివేట్ చెక్‌పోస్టుల్లో సుమారు వంద మంది వరకు కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నామని, గడచిన రెండు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో జీవనం కష్టతరంగా మారుతుందన్నారు. డ్యూటీలకు వెళ్లేందుకు కూడా డబ్బులు లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. తమకు వేతనాలు అందే వరకు విధులను బహిష్కరిస్తామని కార్మికులు తెలిపారు. ఈ విషయమై ఎఎంఆర్ కార్యాలయంలో సమాధానం చెప్పేందుకు అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వీడియో కాల్ ద్వారా యాజమాన్యంతో మాట్లాడించారు. కొద్ది రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని హమీనిచ్చారు. దీంతో కార్మికులు నందిగాం టిడిపి మండల అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ దృష్టికి సమస్య తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి విషయాన్ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల తరుపున న్యాయం చేస్తామని తెలిపారు. తమ వేతనాలు చెల్లించే వరకు విధులను బహిష్కరిస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

అభినందిస్తున్న విప్ అశోక్

అభిజిత్‌కు విప్ అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండలం ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జల్లు అభిజిత్ మొన్న విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 587 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని నేడు అత్యున్నత స్థానంలో ఎంతోమంది ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని అభిజిత్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా అభిజిత్ విజయంలో కీలకపాత్ర పోషించిన తల్లిదండ్రులు జల్లు జయప్రకాష్, నవీన, పాఠశాల ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అనింగి నాగేశ్వరరావు, మొర్రి గోపి, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు ఆర్ లోకనాథం, బడే మాధవరావు, బొడ్డ వేణు గోపాల్, బదకల బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు

వృత్తి విద్యతో నైపుణ్యం

ప్రజాశక్తి- కవిటి

వృత్తి విద్యా శిక్షణ ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగుపడుతుందని రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరామ్ ప్రసాద్ అన్నారు. వృత్తి విద్యా శిక్షణలో భాగంగా ఆరోగ్య విద్యపై కవిటి ప్రభుత్వ ఆస్పత్రిలో పదో తరగతి విద్యార్థులకు పది రోజుల పాటు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని తెలుసుకోవాలని దాన్ని మంచి కోసం వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు పిట్ట సంతోష్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సీమెన్స్ అసోసియేషన్

మత్స్యకార కుటుంబాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నువ్వలరేవు తీరం నుంచి వేటకు వెళ్లి ఇటీవల మృతి చెందిన మంచినీళ్లపేట మత్స్యకార కుటుంబాలకు ఆ గ్రామానికి చెందిన సీమెన్ అసోసియేషన్, గ్రామ యువత కలిసి శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. మంచినీళ్లపేటలో మృతుడు బుంగ ధనరాజు కుటుంబం నిరుపేదలు కావడం, ఇద్దరు చిన్నారులు ఉండడంతో ఆ కుటుబానికి రూ.1.20 లక్షలు, వంక కృష్ణ కుటుంబానికి రూ.30 వేలు ఆర్థికసాయం చేశారు. కుటుంబ అవసరాల కోసం తమవంతు సహాయం చేస్తామని యువకులు తెలిపారు. కార్యక్రమంలో వంక రాజు, గోసాల సంతోష్, వంక జోగారావు, కావల్ల మోహనరావు, మడ్డు రామారావు, గుల్ల బాబి, కె. రామరావు, వంక మోహనరావు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

సిఎం సహాయనిధి ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే గోండు శంకర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి సిఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం విశాఖ ఎ కాలనీలో ఉన్న టిడిపి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లేపల్లికి చెందిన గుడ్ల దుర్గాసికి రూ.66,572, తండ్యాల తవిటి రాజుకు రూ.4,10,000, సామవరపు స్రవంతికి రూ.10,00,000 చెక్కులను పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ ఎం. శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఇచ్ఛాపురంలో దాహం కేకలు

ముందస్తు ప్రణాళికలు చేపట్టని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ తొలిసారిగా ముప్పయి ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా తాగునీటి ఇక్కట్లు తీవ్ర ఆందోళనకు దారితీస్తుంది. ఏటా వేసవి నీటి ఎద్దడి ఉన్నా కుళాయి నీరు సరఫరా చేస్తూ నీటి కొరత కనిపించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకునేవారు. ఈసారి ముందుస్తు ఆలోచన, ప్రణాళిక లేకపోవడంతో రోజురోజుకూ బాహుదా నదిలో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నా... అధికార

ట్యాంకర్ నీటి కోసం మహిళల పాట్లు

యంత్రాంగం అప్రమత్తం కాలేకపోయింది. దీంతో ప్రస్తుతం బాహుదా నదిలో పూర్తిగా భూగర్భ జలాలు అడుగంటిపోయి తీవ్ర నీటి కొరత ఏర్పడింది. మూడు దశాబ్దాలుగా ఎప్పుడూ లేనివిధంగా తాగునీటి కష్టాలు దారుణంగా ఉన్నాయి. అధికార యంత్రాంగం ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పుతున్నా... అవి ఎంతమాత్రం పనికిరాకుండాపోతుంది. ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న నీరూ అధికార పలుకుబడి ఉంటే ఆ వార్డులో సరఫరా అవుతుంది తప్ప వాస్తవంగా నీటి ఇబ్బందులు కనీసం బోర్ సౌకర్యాలు లేని ప్రాంతాలకు నీరు అందడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న దృష్ట్యా అంతంతమాత్రమే ఉన్న బోర్లూ పనిచేయడం లేదు. ఉన్న చెరువులూ బాగుచేయకపోవడంతో అవి ఉపయోగం లేకుండాపోయాయి. మరో వైపుగత వారం రోజులుగా యజ్ఞం పేరుతో బెల్లుపడా ప్రాంతానికి అరకొరగా ఉన్న నీటిని ట్యాంకు ద్వారా నీటిని ప్రత్యేకంగా కేటాయించారు. దీంతో మిగిలిన ప్రాంతాల్లోని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాధాన్యత ఇవ్వడంలో తప్పు లేదు కానీ, అస్సలు నీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో అదనపు

అడుగంటిన బాహుదా నది

ట్యాంకర్ ఏర్పాటు చేస్తే సబబుగా ఉంటుందని అంటున్నారు. బెల్లుపడా యజ్ఞం కూడా గురువారం తో ముగుస్తుంది. నీటి సమస్య తీవ్రతపై కలెక్టర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇచ్ఛాపురం పర్యటన సందర్భంగా సమీక్షించారు. తాగునీటి సమస్యపై అధికారులు తీరు తప్పుపట్టారు. నీటి సమస్య పరిష్కారానికి ఉద్దానం ప్రాజెక్టు నుంచి బాహుదా నీటి సరఫరాకు అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాప్యం చేయకుండా మున్సిపల్ పాలకవర్గం ఈ పనులు వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ పరిస్థితిపై నిర్లక్ష్యం వహిస్తే వార్డులో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కాక తప్పదు. నీటి సమస్యపై పట్టణ వాసులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్, శ్రీకాకుళం నుంచి పెద్దఎత్తున ప్రజలు విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని వినతులను గురువారం ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో పెద్దఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో

పలాస : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పారిశుధ్యం, విద్యుత్, కాలువలు, సాగునీరు, ఇళ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు వస్తున్నాయన్నారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నా మన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి

పలాస: నియోజవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి నూతనంగా రూ. 14.68 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, మందస మండలంలో రూ.8 కోట్లుతో తారురోడ్డు పనులు జరుగు తున్నాయన్నారు. మే మొదటి వారంలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకు తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నా మన్నారు. నువ్వులరేవు గ్రామానికి చెందిన ముంవ్వల సుందరి తన కుమారుడు నగేష్ మృతిపై న్యాయం

శ్రీకాకుళం రూరల్ : వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పలు సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యేకు అందజేశారు. పురపాలక సంఘంలో నూతనంగా మంజూరైన ఆరు స్పౌజ్ వితంతు పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, శివ్వాల సూర్య నారాయణ, నాగళ్ల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల

ప్రజాశక్తి- పలాస

పలాస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి చినబాడాం ఫీడర్‌పై వేసవి దృష్ట్యా ఆర్‌డిఎస్‌ఎస్ స్కీంలో కొత్త విద్యుత్ స్తంభాలు వేస్తున్నామని, అందులో భాగంగానే విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. పెంటిభద్ర, జయరామచంద్రపురం, పద్మ నాభపురం, పాత జాతీయ రహదారి, తాళభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబాడాం అంతరకుడ్డ, రాజపురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

సరిహద్దుల్లో నాటుసారాపై దాడులు

ప్రజాశక్తి- పాతపట్నం

ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో జరుగుతున్న నాటుసారా తయారీ, అమ్మకాలపై శ్రీకాకుళం డిప్యూటీ కమీషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సిహెచ్ తిరుపతినాయుడు, ఒడిశా రాష్ట్ర గంజాం ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్లు సంయుక్తంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆంధ్రాలోని పాతపట్నం, కొత్తూరు మండలాలు, ఒడిశా బోర్డర్ నందు ఉన్న ఒడిశా గ్రామాలైన సింగుపూర్, నేరేడిగూడ, శిరడా, గురిసింగిగూడ గ్రామాలపై శ్రీకాకుళం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రామచంద్రరావు పర్యవేక్షణలో దాడులు జరిపి 10,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 1120 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్టు తిరుపతి నాయుడు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌ఛార్జి ఎఇఎస్ ఎం.శ్రీనివాస రావు, ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు ఆధ్వర్యములో శ్రీకాకుళం, పాతపట్నం, పొందూరు, ఆమదాలవలస, కొత్తూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, ఒడిశా రాష్ట్ర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నువ్వలరేవులో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారి రిచార్డ్ బూన్ రోగులకు వైద్యసేవలు అందించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని, వాతావరణంలో మార్పులు, ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మువ్వల పూర్ణచంద్రరావు, మాజీ ఎంపిటిసిలు బైనపల్లి ఆనంద్, బి.వెంకటేష్, హెచ్ఎస్ చక్రధర్, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సానివాడకు చెందిన సర్పంచ్ లక్ష్మీ రమణమూర్తిని శుక్రవారం ఎమ్మెల్యే గొండు శంకర్ తన కార్యాలయంలో సన్మానించారు. ఈమె ఇటీవల జరిగిన పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా ఢిల్లీలో సర్పంచ్ సమాజ్వాద్ ఛాంపియన్ షిప్ లీడర్ సర్పంచ్ స్టార్ మహిళగా గుర్తించి సన్మానించడం జరిగిందని, గ్రామానికి విశిష్ట సేవలు అందించడం వల్లే ఆమెకు అవార్డు దక్కిందని శంకర్ కొనియాడారు. ఆమెను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.

తూనికల్లో తేడాలు వస్తే చర్యలు

కోటబొమ్మాళి: తూనికల్లో తేడాలొస్తే సంబంధిత వ్యాపారులపై చర్యలు తప్పవని పలాస తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ టి.శ్రీధర్ అన్నారు. మండలంలో శుక్రవారం తూనికలు, కొలతల శాఖాధికారుల ఆధ్వర్యంలో వ్యాపారుల కాటాలకు సీల్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీలు జరిగినప్పుడు తప్పనిసరిగా ప్రతీ కాటాకి సీల్ ఉండాలన్నారు. తూనికలు, కొలతల్లో వినియోగదారులకు అన్యాయం జరుగకుండా న్యాయమైన తూకంతో వస్తువులు అందించడం వ్యాపారుల బాధ్యతన్నారు. కార్యక్రమంలో స్కిల్డ్ వర్కర్ చింతాడ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీల్ వేస్తున్న అధికారి శ్రీధర్

నిర్మాణ రంగంలో సమూల మార్పులు తీసుకొస్తా

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నిర్మాణ రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు సర్క్యులేషన్ పేటర్న్ విధానం అమల్లోకి తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని ఈ విషయంపై అసెంబ్లీలో కూడా చర్చించడం జరిగిందని ఇది అమలులోకి వస్తే అన్ని వర్గాల వారికి ఎంతో మేలు కలుగుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్లో క్రిడాయి ఆధ్వర్యాన మూడు రోజుల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకుల సహకారంతో గృహ నిర్మాణాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాలపై ఎంత సహకారం అందిస్తున్నారని, అంతేకాకుండా గృహ నిర్మాణాలకు హోంలోన్స్ ఇచ్చి గృహ నిర్మాణాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇతర బ్యాంకుల సహకారం ఎంతో ఉందని తెలిపారు. నగరపాలక సంస్థలో నిబంధనల ప్రకారం గతంలో ఇంటి నిర్మాణాల కోసం అనుమతులు రాకుండా చాలా ఇబ్బందులు పడేవారని, ఆ ఇబ్బందులు లేకుండా కేవలం ఇంటి నిర్మాణం కోసం ఎటువంటి షరతులు లేకుండా ప్రజలు నిర్మాణాలు చేపట్టివచ్చని, దానికోసం ప్రత్యేక జిఒ విడుదల చేయడం జరిగిందని, దానిని ప్రజలు వినియోగించు కోవాలన్నారు. అభివృద్ధికి బ్యాంకులు తోడ్పాటు ఎంతో అవసరమని వారి సహకారంతో అటు రైతాంగం, ఇటు పారిశ్రామికవేత్తలు ఎంతో అభివృద్ధి పథంలో నడిచే అవకాశం ఉందని అందువల్ల బ్యాంకులు పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి- కవిటి

జమ్మూ కాశ్మీర్‌లోని బైసారన్ దగ్గర పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి జాడుపూడి ఆర్‌ఎస్‌లో గురువారం రాత్రి ఘన నివాళి అర్పించారు. కూటమి నాయకులు, నవోదయ - నవ యువ చైతన్య యువజన సంఘం సభ్యులు, పోలమ్మ తల్లి వర్తక సంఘం సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి మృతులకు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యావత్ దేశం బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా దేశం మొత్తం బాధితులకు అండగా ఉంటుందన్నారు.

ఎచ్చెర్ల: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పహల్గాం ఉగ్ర దాడులను వ్యతిరేకిస్తూ స్థానిక ట్రిపుల్ ఐటిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ మాట్లాడుతూ వేసవి చల్లదనం, పర్యాటక ప్రదేశాలకు వెళ్లే సందర్శకులను కోల్పోవటం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ , డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, జాతీయ సేవా పథకం కో -ఆర్డినేటర్ డా. పెద్దింటి ముకుంధరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: కాశ్మీర్‌లో ఉగ్రదాడులను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాలుగురోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి, అనంతరం ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు సిర్ల ప్రసాద్, నిమ్మకఅప్పన్న, పనస రమేష్ మాట్లాడుతూ దేశంలో ఇటీవల ఉగ్రవాద కార్యకలాపాలు పెచ్చు మీరాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్తూరు: నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఇప్పటికైనా ఉగ్రవాద నిర్మూలనకు దేశ భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు నాయకులు జి.సత్యం, వెంకటరావు, కృష్ణ, భాస్కరరావు, ప్రసాద్, ఆనందరావు, శ్రీను, ఉపేంద్ర పాల్గొన్నారు.

పొందూరు: జమ్మూ-కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో పొందూరు, జి.సిగడాం మండలాల ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలియజేసి మానవహారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సీర రాము, సెక్రెటరీ రేగడి సతీష్, ట్రెజరర్ సాయి, రాజేష్, నాగరాజు, గన్నబాబు, రాము, శ్రీను, సీతారాం, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

టెక్కలి: కాశ్మీర్లో ఉగ్రవాదులు చేసిన దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని జనసేన టెక్కలి నియోజకవర్గ కన్వీనర్ కనితి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు స్థానిక ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో చిరంజీవి, అనిల్ కుమార్ రాంజీ, నరేంద్ర పాల్గొన్నారు.

శ్రీకాకుళం: నగరంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద జనసేన ఆధ్వర్యాన జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడి ఘటనను నిరసిస్తూ ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ సర్వేశ్వరరావు పాల్గొని మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కింతాడ సంతోష్, రూరల్ మండల అధ్యక్షులు తాటిరాజుల కూర్మారావు, జిల్లా కార్యదర్శులు బమ్మిడి సిద్దు, వరప్రసాద్, చిట్టి భాస్కర్, సుశీల, సిద్దయ్య, బొట్ట శంకర్ యాదవ్, సైలాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : నిరసన చేస్తున్న ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ప్రపంచ మలేరియా దినోత్సవంలో భాగంగా సంతబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు కె.శివరంజని ఆధ్వర్యంలో మలేరియా వ్యాధి నియంత్రణలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆయుష్ డాక్టర్ ఎ.మోహనరావు, ఆరోగ్య విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ ప్రతినిధి కళింగపట్నం అప్పారావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.భాగ్యవతి, హెల్త్ అసిస్టెంట్లు పి. గణేశ్వరరావు, డి.ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస: మండలం రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి టి.సునీల్ కుమార్ మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ వైద్య సహాయం మీ ప్రాంతంలో

సంతబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి శివరంజని తదితరులు

ఉన్న ఆశా కార్యకర్త లేదా ఆరోగ్య కార్యకర్త సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు బోనెల గోపాల్, సిహెచ్‌ఒ ఆదెమ్మ, పిహెచ్ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్ రిషికేశ్వరరావు, హెచ్‌వి ఈశ్వరమ్మ, యుడిసి సుదర్శన్, ఎల్‌టి త్రివేణి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో 8 మందికి గాయాలు

పలాస: కాశీబుగ్గ తిలక్ నగర్‌లో పిచ్చికుక్క దాడిలో 8 మందికి గాయాలయ్యాయి. తిలక్ నగర్‌లో అటువైపుగా వెళ్తున్న కాశీబుగ్గకు చెందిన చంద్రశేఖర్, అప్పయ్యమ్మ, కె.శ్రావణి, చినబడాం గ్రామానికి చెందిన ఎల్.గౌరీ, తాళభద్ర గ్రామానికి చెందిన కె.సాంబయ్య, రాజగోపురం గ్రామానికి చెందిన ఎన్.తులసమ్మపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో వారు చికిత్స పొందుతున్నారు.

పశువైద్యసేవలు అందడం లేదు

ప్రజాశక్తి- బూర్జ

సింహాచలం

మండలంలో పశువైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని దీనిపై పశువైద్య శాఖ ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారాపు సింహాచలం ఒక ప్రకటనలో కోరారు. బూర్జ మండల కేంద్రంతో పాటు కొల్లివలస పశువైద్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు సమయపాలన పాటించడం లేదని, అందుబాటులో ఉండడం లేదని మండలంలోని పాడి రైతులు తమకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పలుమార్లు తమ మూగజీవాలకు వ్యాధులు సంక్రమిస్తే వైద్యం అందక మృత్యువాత పడిన సందర్భాలున్నాయని రైతులు ఆరోపిస్తున్నారని తెలిపారు. వైద్యాధికారులు ఒకచోట ఉండటం లేదా సెలవు మీద ఉండటం జరుగుతుందని తెలిపారు. దీనివలన అత్యవసర సమయంలో పశువులకు వైద్యసేవలు అందడం లేదన్నారు. పశువులకు లక్షలాది రూపాయలు వెచ్చించి వైద్యసేవలు అందిస్తున్నామని, మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వం ఒకవైపు ప్రకటనలు గుప్పిస్తున్నా ఈ మండలంలో కనిపించడం లేదన్నారు. వైద్యాధికారుల తీరుపై పశువైద్యశాఖ ఉన్నతాధికారులు జెడి, ఎడి,ల దృష్టికి తీసుకువెళ్తానని, ఈ విషయంపై ఉన్నతాధికారులు దర్యాప్తు జరిపి మూగజీవాలకు వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు మండల సమావేశం

కొత్తూరు: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నీరజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సోంపేట: పట్టణంలోని గాంధీ మండపం సమీపంలో భగవాన్ సత్యసాయి బాబా పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సుంకిడి ఎంపిటిసి నిమ్మన లీలారాణి చలివేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణానికి వచ్చిన వారికోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. మొదటి రోజు మజ్జిగ పంచిపెట్టారు.

తాగునీటి సమస్యపై పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని ఆంపురం గిరిజన గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడంతో శుక్రవారం ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి సమస్యను పరిశీలించారు. గ్రామంలో ఉన్న బావినీరు అడుగంటి పోవడంతో నీటి సమస్య ఏర్పడింది. అలాగే బోర్‌వెల్ అసంపూర్తిగా ఉండటంతో దానిని బాగు చేసి మోటార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. గిరిజన సంఘం నాయకులు జగన్, బైరాగి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

సోంపేట: స్థానిక జెడ్‌పిటిసి తడక యశోద అత్త, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు తల్లి తడక అన్నపూర్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. శుక్రవారం మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, అప్పలరాజు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు జోగారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరితో పాటు సోంపేట ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు, కంచిలి ఎంపిపి దేవదాస్ రెడ్డి, కంచిలి జెడ్‌పిటిసి ఇప్పిలి కృష్ణారావు, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

తమ్మినేనిని కలిసిన 'కోట'

ఆమదాలవలస: మాజీ స్పీకర్, వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాంను ఆయన స్వగృహంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల వైసిపి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించినందున తమ్మినేని సీతారాంను కలిసి అభినందించి దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు రామచంద్రాపురం మాజీ సర్పంచ్ చల్ల సింహాచలం, జొన్నవలస సర్పంచ్ ప్రతినిధి గొంటి కృష్ణ, తోటాడ సర్పంచ్ ప్రతినిధి జయరాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

వజ్రపుకొత్తూరు: సేవలతోనే అధికారులకు గుర్తింపు లభిస్తుందని ఎంపిపి ప్రతినిధి ఉప్పెరపల్లి ఉదయ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఎంపిడిఒ పురస్కార గ్రహీత ఎన్.రమేష్ నాయుడు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి అధికారిగా రమేష్ నాయుడు గుర్తింపు తెచ్చు కున్నార న్నారు. మండల అభివృద్ధికి పాటుపడుతున్న ఎంపిడిఒను ఉన్నతాధికారులు గుర్తించి పురస్కారం అందివ్వడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒను అధికారులు తిరుమల రావు, నాగభూషణం, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

తాగునీటి బోరు ప్రారంభం

కొత్తూరు: స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో తాగునీటి బోరును శుక్రవారం సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, ప్రధాన వైద్యాధికారి ధర్మాని కిశోర్ కుమార్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ బోరును రోగులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు అనురాధ, టిడిపి నాయకులు లోతుగెడ్డ జనార్ధనరావు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది సింహాచలం, సత్యనారాయణ పాల్గొన్నారు.

30లోగా వార్షిక రిటర్న్స్ దాఖలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో ఉన్న పరిశ్రమల రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న యజమానులు వార్షిక రిటర్న్లు ఇంటిగ్రేటెడ్ విధానంలో ఆన్‌లైన్ ద్వారా పంపించాలని పరిశ్రమల తనిఖీ అధికారి బి. రాజబాబు ప్రకటనలో తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ apindusries.gov.in లో నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న రైసుమిల్లులు, జీడి కర్మాగారాలు, గ్రానైట్ పరిశ్రమలు, క్రషర్లు, షామిల్లులు పెద్ద కర్మాగారాలు ఫ్యాక్టరీల చట్టం 1948 అనుసరించి రిటర్న్లు దాఖలు చేయాలన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేయాలని జిల్లా సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. శుక్రవారం లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారని, వీరంతా సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉంటూ రుసుం చెల్లించి ఉన్నారని, కార్మికుల డబ్బులు ప్రభుత్వం ఖర్చు చేసుకుని, నిర్మాణ కార్మికుల సంక్షేమం విడిచి పెట్టారని ఆరోపించారు. తక్షణమే పెండింగ్ క్లెయిమ్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గూన త్రినాథ్, తిర్లంగి అప్పన్న, దవల లక్ష్మీనారాయణ, బెండి హరి, కొర్రాయి ఆనంద్, సత్తారు ఉత్తర తదితరులు పాల్గొన్నారు.

బోరు ప్రారంభిస్తున్న నాయకులు

తాగునీరు అందుబాటుకు చర్యలు

ప్రజాశక్తి- కవిటి

వేసవి తీవ్రత దృష్ట్యా పంచాయతీలోని ప్రతి గ్రామంలో తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు టిడిపి నాయకులు మణి చంద్రప్రకాష్, సంతోష్ పట్నాయక్, రంగా రౌళో తెలిపారు. ఆర్ బెలగాంలోని దేవాడ వీధిలో మంచినీటి బోరు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎం.ఈశ్వరరావు, బాసుదేవరావు, టి మోహనరావు, జి కేశవరావు, దుర్యోధన, బోనమాలి, బి చిన్న, వెంకటరావు, జి.కృష్ణారావు, అనంత్, తులసయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పరికరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి:

కమ్యూనిటి హైలింగ్ సెంటర్లులో రాయితీపై అందించిన వ్యవసాయ యంత్ర పరికరాలను అద్దెప్రాతిపదికన రైతులు వినియోగించుకోవాలని మండల ఎఒ ఎస్. గోవిందరావు అన్నారు. శుక్రవారం మండలం జర్జంగి సచివాలయం పరిధిలో కమ్యూనిటి హైరింగ్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ట్రాక్టర్, రొటావేటర్, కల్టివేటర్, నూర్పుమిషన్‌లను అద్దెప్రాతిపదికపైన రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం వేసవి దుక్కులకు రైతులు ఈ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ డి.అనిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రస్తుత వేసవి దృష్ట్యా మండలంలో పలు గ్రామాల్లో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు బావుల్లో తాగునీరు అరుగంటిపోయాయి. దీంతో పలుచోట్ల చాలా వరకు నీరు రావడం లేదు. దీంతో ప్రజలు విసుగు చెందుతున్నారు. కొన్నిచోట్ల బోర్లు నిరుపయోగమయ్యాయి. దీంతో పూర్తిస్థాయి నీరు గ్రామస్తులకు అందడం లేదు. కేరాసింగి, నేల బొంతు, భరణికోట, రింపి, ఆంపురం తదితర ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. కొండ ప్రాంతాల్లో తాగునీటికి ఆసరాగా ఉన్న జక్కర నీటి కుంటలు ఎండల ప్రభావానికి అడుగంటి పోయాయి. అలాగే సోలార్ సిస్టంతో పనిచేసే తాగునీటి పథకాలు సైతం

భరణికోటలో తాగునీటికి ఆధారమైన బావి దుస్థితి

మరమ్మతులకు గురై పనిచేయడం లేదు. తాగునీరు ఎద్దడి నివారణకు బోరుబావుల్లో అదనపు నీటి పైపులు అమర్చడంతో పాటు సోలార్ సిస్టం పథకాలు కూడా మరమ్మతులు చేపడితే బాగుంటుందని స్థానికులు అంటున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు తగుచర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అరకొర ట్యాంకర్లతో నీటి సరఫరాపై ఆగ్రహం

ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నిస్తున్న రాజు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం అదనపు ట్యాంకర్లుతో నీటి సరఫరా చేయమని ఇటీవల కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందళాం అశోక్ సూచించినప్పటికీ అధికారుల తీరుపై జనసేన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు అరకొర ట్యాంకర్లుతో నీటిని సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. కమిషనర్ విజయవాడ సమావేశానికి వెళ్లడంతో కార్యాలయంలో ఉన్న అసిస్టెంట్ ఇంజినీర్ తలగల పృథ్విని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ 20న ఎంపీ, ఎమ్మెల్యే అశోక్, జిల్లా కలెక్టర్, అధికారుల సమక్షంలో జరిగిన రివ్యూ మీటింగ్‌లో తాగునీటి సమస్యపై ప్రశ్నించగా అధికారులు రోజుకు ఆరు ట్యాంకర్లుతో నీటిని అందిస్తున్నామని చెప్పారుని తీరా ఇప్పుడు నాలుగు ట్యాంకర్లతోనే నీరు అందుతుందన్నారు. అదనపు ట్యాంకర్ల ద్వారానైనా నీటిని అందించాలని సమావేశంలో చెప్పినా పట్టించుకోలేదన్నారు. వెంటనే ప్రజలకు తాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరితగతిన మట్టి నమూనాల సేకరణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వ్యవసాయశాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మట్టి నమూనాల సేకరణను రైతులు పొలాల్లో సేకరించడం జరుగుతుందని పలాస వ్యవసాయశాఖ ఎడి లింగాల మధుబాబు అన్నారు. మండలంలో ఖరీఫ్, రబి 2025 - 26 సంవత్సరానికి 2219 మట్టి నమూనాలను లక్ష్యం చేసుకోగా రైతుల పొలాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు మట్టి నమూనాలు సేకరించడం జరుగుతుందన్నారు. జగ్రిభద్రలో రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించడం శుక్రవారం నిర్వహించారు. ఈ నమూనాలను ఆమదాలవలస భూసార పరీక్షా కేంద్రానికి పరీక్షల నిమిత్తం పంపించడం జరుగుతుందన్నారు.

మట్టి నమూనాను పరిశీలిస్తున్న ఎడి మధుబాబు

కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు నవీన్, వాసు, ధరన్, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిరుద్యోగ భృతి అందించాలి

టెక్కలి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని తక్షణమే అందించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మెజ్జాడ యుగంధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం టెక్కలిలో జాతీయ మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతుందన్నారు. భగత్‌సింగ్ నేషనల్ గ్యారంటీ ఎంప్లాయిమెంట్ చట్టం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో ఎఐవైఎఫ్ మహాసభలు జరగనున్నాయని వాటిలో చర్చించి సమస్యలు పరిష్కారానికి పోరాటం చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్, కిరణ్, గోవింద్, మోహన్, నితిన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

శ్రీకాకుళం రూరల్: ప్రతి వ్యవసాయ విద్యార్థి కృషి పట్టుదల క్రమశిక్షణతో కలిగి ఉంటే ఉన్నత శిఖరాలను అదిరోహించవచ్చని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వ్యవసాయ కళాశాల ఉపకులపతి డాక్టర్ రమ్మి రజిని అన్నారు. మండలంలోని నైరా ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ కళాశాలలో 36వ కాలేజ్ వార్షికోత్సవం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక దిగుబడి వచ్చే విధంగా వ్యవసాయ మెలకులను ప్రతి విద్యార్థి పెట్టాలని కోరారు. అనంతరం వ్యవసాయ కళాశాల అభివృద్ధి వివరాలను అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. భరత లక్ష్మీ సభకు వివరించారు. స్టూడెంట్ అఫైర్ ఆఫీసర్ డా. డి. చిన్నం నాయుడు ఆటల పోటీలు, విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ప్రోగ్రెసివ్ ఎంటర్ప్రెన్యూర్

మాట్లాడుతున్న విసి రజిని

శ్రియన్ కంపెనీ అధిపతి డా. కె.పాల్గునరావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ విద్యతో పాటు జనరల్ నాలెడ్జ్, సామాజిక అంశాలపైన పట్టు సాదించాలన్నారు. కార్యక్రమంలో నైరా పూర్వపు విద్యార్థి, బాయర్ క్రాప్ సైన్స్ సౌత్ ఇండియా అధిపతి బి.విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పుస్తకావిష్కరణ

ఆమదాలవలస: పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కూన రవికుమార్ చేతుల మీదుగా ఎస్అండ్ఎస్ పబ్లికేషన్స్ సాంఘిక శాస్త్రం మెథడాలజీ పుస్తకావిష్కరణ శుక్రవారం నిర్వహించారు. పుస్తక రచయిత అంపోలు రాజేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ సోషల్ డిఎస్‌సి రాస్తున్న అభ్యర్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ క్లాసుల్లో ప్రభంజనం సృష్టిస్తున్న ఎస్అండ్ఎస్ పబ్లికేషన్స్‌లో స్టేట్ సీనియర్ ఫ్యాకల్టీ అంపోలు రాజేష్ సోషల్ స్టడీస్ మెదడాలజీ పుస్తకాన్ని రచించారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న డిఎస్‌సి అభ్యర్థులు ఈ పుస్తకాన్ని చదవడం వలన డిఎస్‌సిలో శత శాతం మార్కులు వచ్చి ఉద్యోగం పొందుతారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, నూక రాజు, శివ్వాల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న తిలక్ తదితరులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ సాలిపేటకు చెందిన మార్పు భూషణ్‌రావు రెండు ఎకరాల వరికుప్పలతో పాటు అప్పారావు, మహేష్ ట్రాక్టర్, నూర్పు మిషన్ ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. శుక్రవారం వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పరిశీలించి నష్టపోయిన కుటుంబాలకు పరామర్శించారు. బాధితులు బల్లి అప్పారావు, మహేష్ కుటుంబానికి రూ. 10వేలు, అలాగే మార్పు నాగ భూషణరావు కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈయనతో పాటు వైసిపి మండల అధ్యక్షులు సంపతిరావు హేమ సుందరరాజు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, మాజీ వైసిపి మండల అధ్యక్షులు నూక సత్యరాజు, బిసిసెల్ అధ్యక్షులు పేడాడ వెంకటరావు, సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపిటిసిలు బగాది దివాకర్‌రావు, పూజారి సత్యం, సర్పంచ్‌లు కాళ్ల సంజీవరావు, సుంకర జనార్ధనరావు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర జనరల్, వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వి.శంకరరావు తెలిపారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి, సిఇసి, ఎంపిహెచ్, వృత్తివిద్యా కోర్సులున్నాయన్నారు. ఈ ఏడాది ద్వితీయ సంవత్సంలో 75 శాతం, ఉత్తర్ణత సాధించాడంతో నియోజకర్గంలో మొదటి స్థానంలో నిలిచామన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, ఇతర ప్రభుత్వ పథకాలు అర్హులైన విద్యార్థినులకు అందిస్తామన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆడవరంలో వేసవి శిక్షణ

శ్రీకాకుళం రూరల్: గార మండలం ఆడవరంలో వేసవి శిక్షణా కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బోగెల ఉమామహేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నృత్యం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతీ ఏడాది వేసవిలో సెలవులు ఇచ్చిన వెంటనే విద్యార్థులు ఫోన్లు, టివి చూడకుండా పాఠశాలలోనే వినోద కార్యక్రమాలు చేపట్టడం, కథలు చదివించడం, క్రికెట్ ఆడించడం, విద్యార్థులకు బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తామన్నారు.